క్లుప్తంగా

నేటి నుంచి ఉత్సవాలు



భూపాలపల్లి అర్బన్: జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ సమీపంలో నూతనంగా నిర్మించిన శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నేటి(మంగళవారం) నుంచి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. 8వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. స్థానిక ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, గండ్ర జ్యోతి దంపతులు ఆలయ నిర్మాణం చేపట్టారు. తిరుమల నుంచి సోమవారం స్వామి వారి విగ్రహాలను తీసుకు వచ్చారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక



మల్హర్: మండలంలోని ఎడ్లపల్లి గ్రామ యూత్ కాంగ్రెస్ నాయకులు రాజేష్, నరేష్, అరవింద్, సతీష్, మాస్, శ్రీధర్ సోమవారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారికి బీఆర్‌ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జ్, పెద్దపల్లి జెడ్పీచైర్మన్ పుట్ట మధు తన నివాసంలో వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కుంభం రాఘవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మల్క ప్రకాష్‌రావు, నాయకులు వాల యాదగిరిరావు, వెంకట్‌రాజు, రమేష్, బాపు, శ్రీనివాస్, మహేందర్ తదితరులు ఉన్నారు.

నేడు మండల సమావేశం

మహాముత్తారం: మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ రత్నం సు భద్ర అధ్యక్షతన నేడు(మంగళవారం) మండల సర్వసభ్య సమావే శం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఆంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి మండలంలోని వివిధ గ్రామాల కు చెందిన ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికా రులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

వ్యక్తి మృతి



రాజు(ఫైల్)

మల్హర్: మండలంలోని నాచారం గ్రామానికి చెందిన చెండి రాజు(42) మృతి చెందాడు. కొయ్యూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 2న ఓ వ్యక్తికి డబ్బులు ఇస్తానని చెప్పిభార్య వద్ద నుంచి రూ.500 తీసుకోని ఇంటి వద్ద నుంచి బయటకు వెళ్లాడు. రాత్రి 12 గంటలు దాటిన ఇంటికి రాలేదు. దీంతో కుమారుడు రమేష్, లక్ష్మణ్‌లు తెల్లవారు జామున ఆదివారం ఇంటి చుట్టు ప్రక్కల, బంధువులు, స్నేహితుల ఇండ్లల్లో ఆరా తీసిన అచూకి కనిపించలేదు. సోమవారం ఉదయం 7 గంటల సయంలో నాచారం శివారులోని చేను సమీపంలో రాజు మృతి చెంది ఉండడాన్ని గమనించి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భూపాలపల్లి 100 పడకుల ఆస్పత్రికి తరలించారు. భార్య లస్మమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని రాజు మృతిపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

సీనియర్ జర్నలిస్ట్ రామకృష్ణ మృతి

గణపురం: మండలకేంద్రానికి చెందిన సీనియర్ జర్నలిస్టు తాళ్లపెల్లి రామకృష్ణ(45) అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. 25 సంవత్సరాలుగా పలు పత్రికలలో విలేకరిగా సేవలు అదించాడు. కొన్ని రోజులుగా అనారోగ్యంగా హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న ఆయన సోమవారం సాయంత్రం మృతి చెందాడు. రామకృష్ణ మృతితో మండల వ్యాప్తంగా విషాదఛాయలు అలుముకున్నాయి.

రహదారికి మరమ్మతు చేపట్టాలి



ఆందోళన చేస్తున్న యువకులు, నాయకులు

కాటారం: కాటారం నుంచి బస్వాపూర్ వరకు గుంతలమయంగా మారిన జాతీయ రహదారిని మరమ్మతు చేయాలని డిమాండ్ చేస్తూ కొత్తపల్లి హనుమాన్ టెంపుల్ ఎదుట కొత్తపల్లికి చెందిన పలువురు యువకులు, ప్రజలు సోమవారం ఆందోళన నిర్వహించారు. జాతీయ రహదారిపై బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇసుక లారీలు అధికలోడ్‌తో వెళ్తుండటం కారణంగా రహదారి కోతకు గురై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రమాదాల కారణంగా చాలా మంది వాహనదారులు ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. ఇసుక లారీలు అధికలోడ్‌తో వెళ్తున్న సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడం దేనికి నిదర్శనమన్నారు. కలెక్టర్ స్పందించి రోడ్డు బాగుచేయించి ప్రజల ప్రాణాల కాపాడాలని విన్నవించారు. సుమారు రెండు గంటల పాటు కొనసాగిన ఆందోళనతో రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోయింది. ఆందోళన విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఆందోళనకారులను సముదాయించారు. రహదారి మరమ్మత్తు త్వరలోనే జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. గ్రామ ప్రజాప్రతినిధులు, పెద్దలు, యువకులు, రైతులు, ఆటో యూనియన్ నాయకులు, వ్యాపారస్థులు, అంకుషాపూర్, ములుగుపల్లి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అసిస్టెంట్ కలెక్టర్ పర్యటన



ఇంకుడు గుంతను పరిశీలిస్తున్న ఉమాశంకర్

మొగుళ్లపల్లి: అసిస్టెంట్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ మండలంలోని పాతఇస్సిపేట, మొట్లపల్లి గ్రామాల్లో సోమవారం పర్యటించారు. పాతఇస్సిపేట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి అంగన్‌వాడీ కేంద్రానికి మంజూరైన ఇంకుడు గుంతను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఉన్న పిల్లల ఆరోగ్య పరిస్థితి, వారి ఎదుగుదల, వారికి అందిస్తున్న ఆహారం, నాణ్యతా ప్రమాణాలు, పరిశుభ్రత తదితర విషయాలపై అంగన్‌వాడీ టీచర్లను అడిగి తెలుసుకుని రికార్డులను పరిశీలించారు. అనంతరం స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ పథంలో ఎంపికైన మొట్లపల్లి గ్రామాన్ని సందర్శించారు. గంగిరెద్దుల కాలనీతో పాటు ప్రభుత్వ పాఠశాలలో నిర్మించిన కమ్యూనిటీ ఇంకుడుగుంతలను పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతాన్ని, తదితర అంశాలపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీడీఓ కృష్ణవేణి, ఎంపీఓ వీరస్వామి, ఇన్‌చార్జ్ ఏపీఓ రాము, సర్పంచ్‌లు సరళ, పద్మ, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్ సుజాత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజిత, టీఏ మహేందర్, తదితరులు ఉన్నారు.

ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి



డిమాండ్ల నోటీస్‌ను అందజేస్తున్న ఉద్యోగులు

భూపాలపల్లి అర్బన్: విద్యాశాఖ–సమగ్రశిక్షాలో కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ నేటి (మంగళవారం) నుంచి రిలే నిరాహార దీక్షలు చేపటనున్నట్లు జేఏసీ అధ్యక్షురాలు వసంతలక్ష్మి తెలిపారు. ఈ మేరకు సోమవారం జిల్లా విద్యాశాఖ అధికారి రామ్‌కుమార్‌కు డిమాండ్ల పత్రాన్ని అందజేశారు. ఉద్యోగులందరిని విద్యాశాఖలో విలీనం చేయాలని, కనీస వేతనం అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఆరోగ్య బీమా అమలు చేయాలనే డిమాండ్లతో దీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేణు, చాంద్‌పాషా, సుదర్శన్. చంద్రకళ, సంపత్, చంద్రమౌళి, శశికల పాల్గొన్నారు.

నిరుపేదలకు శాపంగా కేంద్ర ప్రభుత్వం



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

చిట్యాల: కేంద్ర ప్రభుత్వం నిరుపేదలకు శాపంగా మారిందని సీపీఎం మండల కార్యదర్శి చింతల రజినీకాంత్ అన్నారు. సోమవారం కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మండల కేంద్రంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యావసర సరుకుల ధరలు 2014 నుంచి ఇప్పటి వరకు 50శాతానికి పెరిగాయని అన్నారు. సరుకులపై 12 నుంచి 18 శాతం పన్నులు వేయడంతో భారం మొత్తం సామాన్య ప్రజలపై పడుతుందని అన్నారు. ఇప్పటికైనా పన్నులను తగ్గించి సరుకుల ధరలను నియంత్రించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చంద్రయ్య, మహేందర్, ఆదయ్య, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

నేటి సమాజంలో మీడియా పాత్ర కీలకం



శంకుస్థాపన చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి, పీఓ అంకిత్

ఏటూరునాగారం: నేటి సమాజంలో మీడియా పాత్ర కీలకమని జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి, ఐటీడీఏ పీఓ అంకిత్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏటూరునాగారం ప్రెస్ క్లబ్ నూతన భవన నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి బడే నాగజ్యోతి, పీఓ అంకిత్ హాజరై భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలకు, ప్రభుత్వానికి సమాచారం చేరవేయడంలో మీడియా పాత్ర కీలకంగా ఉంటుందన్నారు. సకాలంలో సమాచారం ఇవ్వడం వల్ల వరదల సమయంలో అనేక సహాయక చర్యలు చేపట్టామన్నారు. ఐటీడీఏ పథకాలను మరింత ప్రజల్లోకి తీసుకెళ్లాలని, రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, పథకాలపై ప్రజలకు అవగాహన కలిగించేందుకు సహకరించాలన్నారు. అలాగే జర్నలిస్టులకు గృహలక్ష్మి కింద అర్హులైన వారికి ఇళ్లు వచ్చేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సంధ్యారాణి, సీఐ రాజు, ఎస్సై కృష్ణప్రసాద్, రైతు బంధు సమితి అధ్యక్షుడు పల్లా బుచ్చయ్య, ఎంపీపీ అంతటి విజయ, జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలియాబీ, పార్టీ మండలాల అధ్యక్షుడు సునీల్‌కుమార్, రఘు, సత్యం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకన్న, ఆత్మ చైర్మన్ రమణయ్య, ప్రవీణ్, చిన్నికృష్ణ, దేవేందర్, మల్లారెడ్డి, ఆయూబ్, బాదం ప్రవీణ్, శ్రీనివాస్, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు అఫ్జల్‌పాషా, ప్రధాన కార్యదర్శి అలువాల శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు నూక ప్రభాకర్, గౌరవ సలహాదారుడు సీహెచ్ వెంకన్న, రమేష్ ఉన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడిగా సంపత్‌రావు



మల్హర్: ఉత్తమ ఉపాధ్యాయుడిగా మండలంలోని తాడిచర్ల గ్రామానికి చెందిన శ్రీసాయి వాణీవిద్యానికేతన్ ప్రైవేట్ పాఠశాల కరస్పాండెంట్ పీరమనేని సంపత్‌రావు ఎంపికయ్యారు. విద్యారంగంలో చేస్తున్న కృషికి గాను సంపత్ రావును ఉత్తమ ఉపాధ్యాయునికి ఎంపిక చేశారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో నేడు(మంగళవారం) కలెక్టర్ చేతుల మీదుగా ఆయన ప్రసంశ పత్రం, అవార్డు అందుకోనున్నారు.

బాసర ట్రిపుల్‌ఐటీకి జాస్మిన్



టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని భాగిర్తిపేట ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి జాస్మిన్ పదవ తరగతి వార్షిక ఫలితాల్లో 9.5 జీపీఏ సాధించి మండల టాపర్‌గా నిలిచి స్పాట్ అడ్మిషన్‌లో బాసర ట్రిపుల్‌ఐటీలో ప్రవేశం పొందినట్లు సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొండ శ్రీనివాస్ తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రభుత్వ పాఠశాల నుంచి ఐఐఐటీకి జాస్మిన్ ఎంపిక కావడం గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా ఐఐఐటీకి ఎంపికైన జాస్మిన్‌ను ఉపాధ్యాయ బృందం అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుదమల్ల మురళి, లెక్కల ఇంద్రసేనారెడ్డి, వేల్పుల రాజు, అంకం శ్రీనివాస్, ఓనపాకల రాజయ్య, అబ్బోజు మురళి, సూదం సాంబమూర్తి, గుండా రమేష్, చిన్నోజు సరిత, బండి చంద్రమౌళి, పోతుల రమేష్, రఘు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిత్వానికి దరఖాస్తు



దరఖాస్తు అందిస్తున్న భూక్య జవహర్‌నాయక్

ములుగు: బీజేపీ ములుగు ఎమ్మెల్యే అభ్యర్థిత్వానికి వెంకటాపురం(ఎం) మండలానికి చెందిన ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు భూక్య జవహర్‌నాయక్ సోమవారం హైదరాబాద్‌లో ఎన్నికల నిర్వహణ కమిటీ నాయకులకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్షేత్ర స్థాయిలో కార్యకర్తలను కలుపుకుపోతున్నాని అన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు ఆదివాసీ కోయ సామాజిక వర్గానికి చెందిన వారికి టికెట్ కేటాయించారని అన్నారు. దీనిపై స్పందించిన పార్టీ నాయకత్వం పరిశీలిస్తామని చెప్పినట్లు తెలిపారు.

తహసీల్దార్ ఎదుట బైండోవర్

వాజేడు: గుడుంబా అమ్ముతున్న నలుగురు వ్యక్తులను తహసీల్దార్ శ్రీనివాస్ ఎదుట సోమవారం పేరూరు ఎస్సై రమేష్ బైండోవర్ చేశారు. మండల పరిధిలోని చిన్నగొళ్లగుడెం గ్రామానికి చెందిన ఎస్‌కే దాదా సాహెబ్, తాటి లక్ష్మి, ఎస్‌కే సలీమ్, చంద్రుపట్ల గ్రామానికి చెమ్మిన గోగు నర్సింహరావులను బైండోవర్ చేసినట్లు తెలిపారు. రూ 50,000ల పూచీకత్తు చేయడం జరిగిందని ఒక వేల మళ్లీ గుడుంబా విక్రయిస్తే రూ.50, వేలు జప్త చేయడం జరుగుతుందని తెలిపారు.

మహదేవపూర్ బంద్ విజయవంతం



నిర్మానుష్యంగా ఉన్న మహదేవపూర్

మహదేవపూర్: మహదేవపూర్‌ను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలనే డిమాండ్‌లో భాగంగా జేఏసీ నాయకుల పిలుపు మేరకు సోమవారం చేపట్టిన మండల బంద్ విజయవంతమయింది. వ్యాపార వాణిజ్య సంస్థలు, చిరువ్యాపారులు, కూరగాయలు హోటళ్ల యాజమానులు రెవెన్యూ డివిజన్ కోసం బంద్‌లో పాల్గొని పూర్తి మద్దతు తెలిపారు. ఆటో యునియన్ అధ్యక్షుడు అక్రమ్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దిక్షలు చేశారు. శంశీర్, రాము, బెల్లంపల్లి జషువా, మల్లేష్, తాజ్, హుస్సేన్, అజ్మత్, అన్వర్, కాలి, మన్సూర్, తదితరులు పాల్గొన్నారు.

‘చల్ల నారాయణరెడ్డి కాంగ్రెస్ పార్టీ కోవర్టు’



మాట్లాడుతున్న జనార్దన్

కాటారం: బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడిని అని చెప్పుకుంటున్న చల్ల నారాయణరెడ్డి కాంగ్రెస్ పార్టీ కోవర్టుగా మారడని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోట జనార్దన్ ఆరోపించారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. చల్ల నారాయణరెడ్డి దళితబిడ్డలను బెదిరించి భూములను అక్రమంగా కబ్జాచేసి వారిని బానిసలుగా వాడుకుంటూ పార్టీలో చిచ్చుపెడుతున్నారని విమర్శించారు. అమాయక దళితుల వందలాది ఎకరాల భూములను అక్రమంగా లాక్కొని నారాయణరెడ్డి ఈ ప్రాంతంలో దళిత విద్రోహిగా మారారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఉండగా అనేక అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని బీఆర్ ఎస్ పార్టీలో ఆయన ఆటలు చెల్లక పార్టీపై విష ప్రచారానికి పూనుకుంటున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కనుసన్నల్లో పని చేస్తున్న నారాయణరెడ్డి అనే భూకబ్జాదారుడిని వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని కేసీఆర్, కేటీఆర్‌ని కోరుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడు రామిళ్ల కిరణ్, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ చిలువేరు మహేశ్, ఎంపీటీసీ బాసాని రవి, నాయకులు బొడ్డు రాజబాపు, గాలి సడువళి, వంగళ రాజేంద్రాచారి, నరివెద్ది శ్రీనివాస్, దుర్గారావు, దేవేందర్, రజనీకాంత్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



కొప్పుసూరు వద్ద తనిఖీ చేస్తున్న పోలీసులు



ధర్మవరం వద్ద తనిఖీలు చేస్తున్న పోలీసులు

వాజేడు: మండల పరిధిలో కొప్పుసూరు వద్ద వాజేడు ఎస్సై వెంకటేశ్వర్ రావు, ధర్మవరం వద్ద పేరూరు ఎస్సై రమేష్ సోమవారం సివిల్, సీఆర్‌పీఎఫ్ పోలీసులతో కలిసి వాహనాల తనిఖీలను ముమ్మరంగా చేశారు. వాజేడు నుంచి భద్రాచలం వెళ్లే రహదారిలో ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయడంతో పాటు అందులోని వస్తువులను నిశితంగా పరిశీలించారు. అదే విధంగా పేరూరు ఎస్సై రమేష్ పేరూరు వైపు వచ్చి వెళ్లే ప్రతీ వాహనాన్ని సోదాలు చేశారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న సత్యనారాయణరావు

గణపురం: మండలంలోని సీతారాంపురం, కొండంపల్లి గ్రామాలకు చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సీతారాంపురం గ్రామానికి చెందిన గంధం సురేష్, మల్లేష్, సమ్మయ్య, సంపత్, తిరుపతి, కొమురయ్య, చంద్రమౌళిలతో పాటు కొండముపల్లి గ్రామానికి చెందిన దాసరి విజయ, నగరంపల్లి గ్రామ ఉపసర్పంచ్ దాసరి లక్ష్మయ్య, ఎడ్ల పెద్ద ఎల్లయ్య, సుంకరి రాజు, కొడారి తిరుపతి, సుంకరి కృష్ణా రెడ్డితో పాటు సుమారు 100 మంది పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విడిదినేని అశోక్, నాయకులు దూడపాక శంకర్, ఎర్రబెల్లి రామేశ్వర్ రావు,సుంకరి సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెండో ఏఎన్‌ఎంల సమ్మె విరమణ

ములుగు: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 15 నుంచి రెండో ఏఎన్‌ఎంలు కొనసాగిస్తున్న సమ్మెను ప్రభుత్వ సూచనల మేరకు సోమవారం తాత్కాలికంగా విరమించి డీఎంహెచ్‌ఓ అల్లెం అప్పయ్యకు రిపోర్ట్ చేశారు. 16 సంవత్సరాలుగా మొదటి ఏఎన్‌ఎంలతో సమానంగా విధులు నిర్వహిస్తున్న తమను రెగ్యులర్ చేయాలని, రాత పరీక్షలను రద్దు చేయాలని కోరారు. సమస్యలపై అధ్యయనానికి ఈ నెల 1న రాష్ట్ర ప్రభుత్వం త్రిసభ్య కమిటీని నియమించిందని, కమిటీ సభ్యులు తమ పట్ల సానుకూలంగా ఉండి ప్రభుత్వానికి నివేదిక అందించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జమునా రాణి, మంజుల పాల్గొన్నారు.

తాత్కాలికంగా వాయిదా..

ములుగు రూరల్: రెండో ఏఎన్‌ఎంల సమస్యలపై ప్రభుత్వం వేసిన కమిటీ సమస్యల పరిష్కారానికి మార్గం చూపుతుందని తెలుపడంతోనే సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు ఏఐటీయూసీ నాయకుడు రవీందర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం సమ్మె శిబిరంలో ఏఎన్‌ఎంలతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 రోజుల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ రెండో ఏఎన్‌ఎంల సమస్యలను పరిష్కరించని పక్షంలో మళ్లీ సమ్మెకు దిగుతామని హెచ్చరించారు.

వరద బాధితులకు చేయూత



పంపిణీ చేసిన సరుకులతో వరద బాధితులు, సంస్థ ప్రతినిధులు, నాయకులు

ఎస్ఎస్ తాడ్వాయి: ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లా కోయలగూడెం మండలంలోని కోయగూడెం గ్రామానికి చెందిన లివింగ్ స్యాక్రిఫైస్ మినిస్టరీస్ (ఎల్ఎస్ఎం) స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని వరద బాధితులకు సోమవారం చేయూతనందించారు. మండలంలోని జలగలంచ, మొండ్యాలతోగు, దేవునిగుట్ట, కామారం, కొండపర్తి గొత్తికోయ గూడెంలోని కుటుంబాలతో పాటు కొండపర్తి గ్రామంలోని బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులను స్వచ్ఛంధ సంస్థ ప్రతినిధులు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ ఎం.దేవసాయం మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలకు నష్టపోయిన బాధితులను ఆదుకునేందుకు సంస్థ ద్వారా 300 కుటుంబాలకు గాను ఒక్కొ కుటుంబానికి రూ.4,500ల విలువ గల సరుకుల కిట్ పంపిణీ చేశామన్నారు. సుమారు రూ.13 లక్షల విలువైన సరుకులను వారికి సాయంగా అందించామన్నారు. బాధితులను ఆదుకోవాలని ఎమ్మెల్యే సీతక్క పిలుపు మేరకు సంస్థ ద్వారా సాయం అందించామన్నారు. సంస్థ ట్రెజరర్ ప్రేమకుమారి, సభ్యులు రాంబాబు, డేవిడ్ రాజు, సోమేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్, సర్పంచులు ఇర్ప సునిల్, రేగ కళ్యాణి, జిల్లా నాయకుడు లచ్చుపటేల్, పీఏసీఎస్ డైరెక్టర్ సిద్దిరెడ్డి తదితరులు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి



ఏటూరునాగారం: మాట్లాడుతున్న పీరయ్య

ఏటూరునాగారం: రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ చేపట్టాలని ఎమ్మెస్పీ నాయకుడు గుగ్గిళ్ల పీరయ్య తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీజేపీ అధికారంలోకి వస్తే 100 రోజుల్లో వర్గీకరణ చేపడుతామని ప్రకటించిందని అన్నారు. అధికారంలోకి వచ్చి 9 సంవత్సరాలు గడుస్తున్న వర్గీకరణ చేపట్టలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు ఏక్ శంకర్, జన్ను రవి, నెమలి నరసయ్య దాసోజు చంద్రమౌళి, వావిలాల స్వామి, వావిలాల సాంబశివరావు పాల్గొన్నారు.

కన్నాయిగూడెం: వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ఏబీసీడీ వర్గీకరణ చేయాలని ఎమ్మెస్పీ నాయకుడు గుగ్గిళ్ల పీరయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మహేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ చేపట్టే వరకూ ఉద్యమిస్తామన్నారు.